ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 12 డిసెంబరు 2024



'స్వర్ణాంధ్ర డివిజన్ డాక్యుమెంట్'కు జిల్లావాసులు

పార్వతీపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ కార్యక్రమానికి జిల్లావాసులు భారీగా తరలివెళ్లనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఈ నెల 12న ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో రైతులు, ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లు, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు బయల్దేరనున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులకు దీనిపై దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు ప్రతి శాఖ నుంచి సిబ్బంది విజయవాడ బయల్దేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతాలపై
ఐటీడీఏ శీతకన్ను

- ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో మూలకు చేరిన సాహస క్రీడా పరికరాలు
- మెట్టుగూడ జలపాతం వద్ద వసతులు కరువు
- కొత్తదనం లేక.. ముఖం చాటేస్తున్న సందర్శకులు

సీతంపేట రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పర్యాటకం అంటే గుర్తుకొచ్చేది సీతంపేట మన్యం. ఎత్తయిన కొండలు, జలపాతాలు, పార్కులు, ప్రకృతి రమణీయ ప్రదేశాలకు కొదవే లేదు. అందుకే ఏటా కార్తీకమాసం నుంచి సంక్రాంతి వరకు సీతంపేట ఏజెన్సీ పర్యాటకులతో కళకళలాడుతుంది. అయితే నిత్యం ఆదాయం చేకూర్చే ఈ పర్యాటక ప్రాంతాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో పర్యాటకాభివద్ధి పడకేసింది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సీన్ మారింది. పాలనా పగ్గాలు చేపట్టిన కొద్దినెలల వ్యవధిలోనే పర్యాటక ప్రాంతాలపై సర్కారు దృష్టి సారించింది. దీనిలో భాగంగా సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్ అభివృద్ధికి రూ.1.5కోట్లు మంజూరు చేసింది. అయితే ఉన్నంతలో నిత్య ఆదాయం చేకూర్చే అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాత అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోంది. ఐటీడీఏ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమనే విమర్శలు లేకపోలేదు. వాస్తవంగా ఏడాది ఆదాయమంతా ఈ మూడు నెలల సీజన్‌లోనే వచ్చే అవకాశం ఉన్న ఈ పర్యాటక ప్రాంతాల్లో కొత్తదనం తీసుకొచ్చేందుకు ఐటీడీఏ అధికారులు ప్రయత్నించడం లేదు. ఫలితంగా సందర్శకుల సంఖ్య తగ్గుతోంది. ఐటీడీఏకు వచ్చే ఆదాయానికి గండి పడుతోంది.



ఆదలి వ్యూ పాయింట్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకర మలుపు వద్ద కానరాని హెచ్చరిక బోర్డులు

గతంలో ఇలా...

సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌ను 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తీర్చిదిద్దారు. దీనికోసం సుమారు రూ.3 కోట్లు వెచ్చించారు. అతి తక్కువ కాలంలోనే ఈ పార్క్ పర్యాటకులను విశేషంగా ఆకర్షించి ఐటీడీఏకు ఆదాయం చేకూర్చే ప్రధాన వనరుగా మారింది. దీంతో పాటు మెట్టుగూడ జలపాతం కూడ పర్యాటకంగా ప్రసిద్ధి గాంచింది. అయితే గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా మూలంగా పార్క్‌లో ఉండే సాహస క్రీడా పరికరాలు మూలకు చేరాయి. ఈ పార్క్ నిర్వహణ బాధ్యతలను గతంలో సవర చిత్రకళల అభివృద్ధి సహకార సంఘానికి అప్పగించారు. దీంతో సంఘం పర్యవేక్షణలో సాహస క్రీడలు అన్నీ వినియోగంలో ఉండేవి. వారి తరువాత పార్క్, మెట్టుగూడ వాటర్‌ఫాల్స్ నిర్వహణ బాధ్యతలను ఐటీడీఏ చూస్తోంది.



సందర్శకులు రాక వెలవెలబోతున్న మెట్టుగూడ జలపాతం

ఇదీ పరిస్థితి..

- ఒకప్పుడు సీతంపేట ఐటీడీఏ పార్క్ అంటేనే సాహస క్రీడలకు పెట్టింది పేరుగా ఉండేది. చిన్నారులను ఆకర్షించే బాలల విహార్, ఆనంద, జలవిహార్, సాహస, వినోద, వైవిధ్య, శౌర్య, అపూర్వ, వినూత్న, విస్మయ, అశ్వ, ఊయల, గగన, వెన్నెల విహారాలను అప్పట్లో రూపకల్పన చేశారు. చిన్నారుల, మహిళలు, యువత కోసం మొత్తంగా 17రకాల ఈవెంట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. కాగా ఈ సాహస క్రీడల్లో వినియోగించే యంత్రాల నిర్వహణను ఐటీడీఏ అధికారులు విస్మరించారు. దీంతో కొన్ని పరికరాలు మూలకు చేరాయి. ప్రధానంగా ఆల్ టెర్రయిన్ వాహనాలు ఏడాదిన్నర కాలంగా మూలన పడి ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి అప్పట్లో కొనుగోలు చేసిన పారా మోటారింగ్ యంత్రం గడచిన రెండున్నర ఏళ్లుగా మరమ్మత్తులకు నోచుకోవడం లేదు. గిరి విహార్ వాహనాలకు కాలం చెల్లింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఇటీవల అరకు ప్రాంతం నుంచి పారా మోటారింగ్‌ను తీసుకొచ్చి రెండు రోజులకు అద్దె చెల్లించారు. ఇదిలా ఉండగా పార్క్‌లో చిన్నపిల్లలు ఆడుకునే జారుడు బల్లలు తుప్పుపట్టి అధ్వానంగా మారాయి. వీటిపై చిన్నారులు ఆడుకుని గాయాల పాలవుతున్నారు. అయినప్పటికీ ఐటీడీఏ అధికారులు వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో మూలకు చేరిన ఆల్‌టెర్రయిన్ వెహికల్, గిరివిహార్ వాహనాలు

- మెట్టుగూడ జలపాతం వద్ద అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులు సైతం నిరాశ చెందుతున్నారు. పర్యాటకులు సేదతీరేందుకు విశ్రాంత బల్లలు, చిన్నారులు ఆడుకునేందుకు క్రీడలు లేకపోవడంతో పలువురు ఐటీడీఏ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- ఇటీవల ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఆదలి వ్యూ పాయింట్‌లో కూడా ఎటువంటి ఈవెంట్‌లు ఏర్పాటు చేయలేదు. కేవలం ఫొటో షూట్‌కి మాత్రమే అవకాశం ఉండడంతో అక్కడకు వెళ్లే చిన్నారులు, మహిళలు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా గిరిశిఖరంపై ఆదలి వ్యూ పాయింట్ ఉండడంతో కొండ పైకి వెళ్లాలన్నా..

(మిగతా 8వ పేజీలో...)


వసతిగృహాల్లో
మరమ్మతులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదకొండు సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో సుమారు రూ.189లక్షలతో మరమ్మతు పనులు చేపట్టనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వసతిగృహాల్లో మేజర్ మరమ్మతులకు రూ.150.81 లక్షలు, మైనర్ పనులకు రూ.37.60 లక్షల చొప్పున ప్రభుత్వం కేటాయించిందన్నారు. సంబంధిత అధికారులు కార్యనిర్వాహక ఏజెన్సీలను గుర్తించి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. పాక్షిక మరమ్మతులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ అనుమతులకు లోబడి పనులు చేపట్టాలని తెలిపారు. వసతి గృహాల్లో పనులు చేపట్టక ముందు, ఆ తర్వాత పరిస్థితుల ఫొటోలను తీసి తమకు అందించాలన్నారు. ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి బిల్లులను అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే
పీడీ యాక్ట్

- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

పార్వతీపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ ఉపయోగించేందుకు వెనుకాడొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసినా, రీసైక్లింగ్ చేసినా రెండో ఆలోచన లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ బియ్యాన్ని ప్రజలు ఎందుకు తిరస్కరిస్తున్నారు? ఎంతకు విక్రయిస్తున్నారనే తదితర అంశాలపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబంధిత మంత్రులు, అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు.

వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

వ్యవసాయంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పాడి పరిశ్రమ అభివృద్ధి, గొర్రెలు, మేకలు పెంపకానికి చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. పామాయిల్ పంటకు ఉమ్మడి జిల్లా అనుకూలంగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ చెప్పడంతో ఆ సాగును ప్రోత్సహించాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై చర్చించారు.

సీఎం దృష్టికి ఏనుగుల సమస్య

పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల వాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. పార్వతీపురం మన్యంలో సుమారు 381 గిరిజన గ్రామాలకు రహదారులు లేవని, ఈ సమస్యను రెండేళ్లలో పరిష్కరించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలిపారు. అటవీశాఖ నిబంధనల వల్ల రహదారులు నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గిరిజన గ్రామాలకు రోడ్లు నిర్మించే సమయంలో ఆ శాఖ మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి వివరాలు ఇవ్వాలని ఆదేశించడంతో దీనిపై జిల్లా కలెక్టర్లతో ప్రస్తావిస్తానని అటవీశాఖ చీఫ్ సెక్రటరీ చెప్పారు. కుంకిల ద్వారా మూడు నెలల్లో ఏనుగుల సమస్యను పరిష్కరించడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, తమిళనాడులో కొంత మందికి శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సదస్సులో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

రాష్ట్ర పండుగగా
శంబర జాతర

- సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ
- ఏర్పాట్లపై సమీక్ష



6లో

జడ్పీ ఆవరణలో
వైసీపీ కార్యక్రమం

- ఆందోళనల పోస్టర్ ఆవిష్కరించిన ఆ పార్టీ నాయకులు
- కొన్నాళ్లుగా రాజకీయాలకు వేదికగా మారిన కార్యాలయం

6లో

పసుకుడిలో
గజరాజులు

భామిని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భామిని మండలం పసుకుడిలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. మంగళవారం రాత్రి ఒడిశా నుంచి వంశధార నది దాటి వచ్చిన నాలుగు ఏనుగులు గ్రామ సమీపంలోని పంట పొలాల్లో తిష్ఠ వేశాయి. ప్రస్తుతం చెరకు తోటల్లో అవి సంచరిస్తుం డడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు కూడా సాహసించడం లేదు. ఏనుగుల కారణంగా వరితో పాటు చెరకు, కూరగాయలు, మొక్కజొన్న పంటలు నాశనమయ్యే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని రైతులతో పాటు గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కేర్ టేకర్లతో గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులు సంచరిస్తున్న నేపథ్యంలో ఒంటరిగా బయటకు రావొద్దని సూచిస్తున్నారు.



పసుకుడి చెరకు తోటలో సంచరిస్తున్న ఏనుగులు

14న నీటి సంఘాలకు ఎన్నిక

- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

పార్వతీపురం, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి సంఘాల ఎన్నిక సందడి నెలకొంది. వివిధ కారణాలతో ఇప్పటికే పలుమార్లు వాయిదా పడుతూ వస్తున్న ఈ ఎన్నికను ఈ నెల 14న నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి బుధవారం నోటిఫికేషన్ జారీ కాగా జిల్లా యంత్రాంగం ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని వీఆర్ఎస్, వట్టిగెడ్డ, పెద్దగెడ్డ, పెదంకలాం, తోటపల్లి, రెండు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో 213 సంఘాలు ఉన్నాయి. మేజర్ సాగునీటి సంఘాలు 22, మైనర్ 166, మీడియం సాగునీటి సంఘాలు 25 ఉన్నాయి. వాటిల్లో 1560 టెరిటోరియల్ కాన్‌స్టిట్యుయెన్సీ (టీసీ) సభ్యులు ఉన్నారు. పార్వతీపురం మండలంలో 28 సంఘాలు, సీతానగరం 19, బలిజిపేట 16, సాలూరు 11, మక్కువ 11, పాచిపెంట 3, కురుపాం 22, గుమ్మలక్ష్మీపురం 11, జియ్యమ్మవలస 14, గరుగుబిల్లి 17, కొమరాడ 10, భామిని 25, పాలకొండ 11, వీరఘట్టం 11, సీతం పేటలో 2 సంఘాలకు ఎన్నిక జరగనుంది. జిల్లాలో 1,16,332 మంది పురుషులు, 45,611 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారంతా ఈ ఎన్నికలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈనెల 12న సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నుకుంటారు. 13న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14న ప్రాజెక్టు కమిటీలకు నీటి పారుదలశాఖ, కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించనున్నారు.

గత వైసీపీ పాలనలో..

ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో సంఘాలు నిర్వీర్యమయ్యాయి. సాగునీటి సంఘాలకు కమిటీలు లేక చెరువులు, కాలువలు గాడి తప్పాయి. వాటిలో వ్యర్థాలు, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు పేరుకు పోయాయి. అనేక ప్రాజెక్టుల గేట్లుకు మరమ్మతులు చేయడం లేదు. సాగునీటి కాలువలకు గండ్లు ఏర్పడి నీరు వృథాగా పోవడంతో ఎగువ ప్రాంతాల్లోని పంటలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. అనేక చోట్ల వ్యవసాయనికి నష్టం వాటిల్లింది. కాగా కూటమి అధికారం చేపట్టిన వెంటనే రైతు సంక్షేమంపై దృష్టి సారించింది. కీలకమైన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. సాగునీటి సంఘాలు ఎన్నికైతే నీటి వనరులను బాగు చేసుకునేందుకు ఆస్కారం కలుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

వేడెక్కిన రాజకీయం

నీటి సంఘాల ఎన్నికల కోసం ఫారం-3(ఎ), ఫారం-3 (బి) జారీచేశారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ ఎన్నికలో అన్నింటా విజయం సాధించి తమ పట్టు నిరూపించుకోవాలని కూటమి నాయకులు భావిస్తున్నారు. వాస్తవంగా జిల్లాలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. ఈ నేపథ్యంలో అత్యధిక స్థానాల్లో కూటమి నుంచి టీడీపీ మద్దతుదారులు బరిలో నిలిచే పరిస్థితి కనిపిస్తుంది. బీజేపీ, జనసేన నేతలకు కూడా కొన్ని స్థానాల్లో ప్రాతినిధ్యం కల్పించి వారి విజయానికి టీడీపీ నేతలు సహకరించనున్నారు. ఇప్పటికే విజయవంతమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న సాగునీటి వనరుల అభివృద్ధి అంశాలను ఓటర్లకు చెప్పి.. ఎన్నికలో ఘన విజయం సాధించాలనే పట్టుదలతో వారున్నారు. నీటి సంఘం చైర్మన్‌కు ముందు టీసీల ఎన్నిక ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన తర్వాత కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు పావులు కదుపుతున్నారు.



ప్రమాదంలో పిల్లల ఆరోగ్యం

- చిన్నారుల్లో పెరుగుతున్న సెల్ వినియోగం
- దృష్టిలోపానికి అదే ప్రధాన కారణం
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు





● రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో నివాసముంటున్న శ్రీనివాసరావుకు లాస్య అనే కుమార్తె ఉంది. మూడో తరగతి చదువుతోంది. ఎక్కువగా సెల్ ఫోన్‌తో పాటు ట్యాబ్‌కు అతుక్కుపోతోంది. దీంతో విపరీతమైన తలనొప్పికి గురికావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి కళ్లజోడు ఇచ్చారు.

● రాజాంలోని మేదరవీధికి చెందిన చెందిన గోవిందరావుకు ఇద్దరు పిల్లలు. చేతిలో సెల్ ఫోన్ పెట్టనిదే వారు భోజనం చేయరు. లేకుంటే వారి అల్లరికి అవధులు ఉండవు. ఎక్కువగా సెల్ చూసే అలవాటు వారిది. అయితే ఇద్దరు పిల్లలు ఇప్పుడు కళ్లజోడు తొడుక్కోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది.

రాజాం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ ఇద్దరు పిల్లలే కాదు. ఇప్పుడు ప్రతి ఇంటా ఇదే పరిస్థితి. పిల్లలకు సెల్‌ఫోన్ అలవాటు చేసి చేజేతులా వారి ఆరోగ్యానికి భంగం కలిగిస్తున్నారు. సెల్‌ఫోన్ వినియోగం చిన్నారుల ఆరోగ్యానికి శాపంగా మారింది.

పిల్లల రోజువారి సెల్‌ఫోన్ వినియోగంపై కొద్దిరోజుల కిందట (హ్యాపీనెట్జ్) సంస్థ సర్వే చేపట్టింది. ఈ సర్వే నివేదిక ప్రకారం 42 శాతం మంది 12 సంవత్సరాల్లోపు పిల్లలు రోజుకు 2 గంటల నుంచి 4 గంటల వరకూ ఫోన్ స్క్రీన్లకు అతుక్కుపోతున్నారని, 12 ఏళ్ల కంటే పైబడిన పిల్లలు రోజులో 47 శాతంపైబడి సెల్ ఫోన్లు చూస్తున్నారని, 69 శాతం పిల్లలకు సొంతంగా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఉన్నాయని తేలింది. 12 ఏళ్ల కంటే పైబడిన వయసున్న పిల్లలు ఎలాంటి షరతులు లేకుండా ఇంటర్నెట్ యాక్సెస్ పొందుతున్నారని తేలింది. 74 శాతం మంది పిల్లలు కేవలం యూట్యూబ్ చూసేందుకే ఫోన్ వాడుతుంటే.. మరికొందరు గేమింగ్ కోసం ఎక్కువగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు తేలింది.

సెల్ వినియోగం అధికం..

మనిషి నిత్య జీవితంలో సెల్‌ఫోన్ ఒక భాగమైంది. కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి మొబైల్ ఫోన్లు ఉన్నాయి. సగటున ఒక కుటుంబం సెల్‌ఫోన్ ఖర్చు నెలకు కచ్చితంగా రూ.700. అది కూడా భార్యాభర్తలు ఉన్న కుటుంబంలో. పిల్లలు వినియోగిస్తే దానికి మరో రూ.300 అదనం. ఇక అపరిమిత డేటాను కూడా వినియోగించి రోజులో ఇంటర్ నెట్ బ్యాలెన్స్ వేసిన వారు ఉంటారు. అయితే ఇంతలా సెల్‌ఫోన్ వినియోగం పెరిగినా ప్రయోజనం ఉందా? అంటే సమాధానం దొరకని పరిస్థితి. సెల్‌ఫోన్ వినియోగంతో లాభాలు ఎంత ఉన్నాయో? అంతకు మించి దుష్పరిణామాలు ఉన్నాయి. పిల్లల చదువుల కోసమని తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు కొనుగోలుచేసి ఇస్తుంటారు. కానీ వారు యూట్యూబ్ చూసేందుకే ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనికితోడు కొందరు పక్కదారి పడుతున్నారు. పబ్జీ, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడుతున్న వారు కూడా ఉన్నారు. కొంతమంది యువకులు గ్రూపులుగా ఏర్పడి ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. మరికొందరు అయితే ఆన్‌లైన్ జూదాలకు అలవాటు పడి అప్పుల పాలవుతున్నారు. కొందరు వేధింపులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.





వీటిని అలవాటు చేయాలి..

కుటుంబంలో సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలి. ఒక వేళ విద్య, ఇతర అవసరాలకు ఇచ్చినా వారిపై ఒక కన్నేసి ఉంటాలి. వ్యసనంగా మార్చే గేమ్‌లు ఉంటాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు ఈ విషయంలో చాలారకాలుగా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలు మానసిక రోగులుగా మారితే వారి భవిత దెబ్బతింటుంది. ఆ ప్రభావం కుటుంబంపై పడుతుంది. తల్లిదండ్రులు ఎక్కువ సమయం పిల్లలతో గడపాలి. అలా గడుపుతున్నామన్న విషయం పిల్లలకే తెలియకూడదు. వారి మనసు ఇతర వ్యసనాలపై మళ్లకుండా అది చాలా దోహదపడుతుంది. వీకెండ్‌లో మంచి ప్రదేశానికి తీసుకెళ్లాలి. పరిసరాలను, సమాజాన్ని వారికి పరిచయం చేయాలి. సమగ్ర అవగాహన వచ్చేలా, అర్థమయ్యేలా చేయాలి. తల్లిదండ్రులు సైతం వీలైనంత వరకూ పిల్లల ముందు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలి. పిల్లలు పడుకున్న తరువాత వాడుకోవడం చాలా ఉత్తమం. ఉమ్మడి కుటుంబాలు, బంధువులు, పూర్వీకులు, రక్తసంబంధీకుల గురించి చెప్పాలి. ఖాళీ సమయాల్లో బంధువుల ఇంటికి తీసుకెళ్లాలి. మానవ సంబంధాలతో మానవీయ విలువలను తెలియజెప్పాలి. తెలుగు పద్యాలు, పాటలు, సంగీతం, వ్యాసరచన, పెయింటింగ్ వంటి వాటిపై ఆసక్తి పెంచాలి. ముఖ్యంగా వారు నేర్చుకోవాలి అన్న ధ్యాస పెంచితే మిగతా అనవసర విషయాలపై దృష్టి తగ్గుతుంది. ఇంటి పరిసరాల్లో ఖాళీ ప్రదేశాల్లో మిద్దె కూరగాయలు పెంచాలి. ఖాళీ సమయాల్లో పిల్లలు అక్కడ పనిచేసే అలవాటు చేయాలి.

పిల్లల ఆరోగ్యానికి చేటు..

పిల్లలు సరదా పడుతున్నారని.. వారి అల్లరి నుంచి తప్పించేందుకు ఫోన్లు ఇస్తుంటారు. అక్కడే తప్పు ప్రారంభమవుతుంది. ఆ తప్పే అనర్థాలకు దారితీస్తోంది. పిల్లలకు నేర్చుకోవాలన్న ధ్యాస తగ్గుతుంది. చివరకు గుణింతాలు, అంకెలు, జవాబుల కోసం సెల్‌ఫోన్లనే వాడుతున్నారు. టీనేజ్‌ల సెల్ ఫోన్ల వినియోగం కూడా ఎన్నో దుష్పరిణామాలకు దారితీస్తోంది. చిన్నారుల్లో అయితే మానసిక వ్యాధులు, వ్యసనానికి కారణమవుతోంది. అందుకే తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

-తిరుపతిరావు, వైద్య నిపుణుడు, రాజాం

రాష్ట్ర పండుగగా శంబర జాతర

- సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పార్వతీపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు శంబర పోలమాంబ జాతరను రాష్ట్రస్థాయి పండుగగా నిర్వహించాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో శంబర జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శంబర పోలమాంబ మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జాతర సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భారీగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అమ్మవారి దర్శనానికి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పక్కాగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బంది ఉండరాదని, కొళాయిలు, బోర్లు పూర్తిస్థాయిలో పనిచేయాలని, పారిశుధ్య మెరుగు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్కింగ్ వ్యవస్థ మెరుగ్గా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని సూచించారు. సిరమాను తిరిగే రోజున విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 23న చాటింపుతో ప్రారంభై ఏప్రిల్-1న జరిగే చండీ హోమం, మహా అన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. జనవరి 27న తొలేళ్లు, 28న అమ్మవారి సిరిమానోత్సవం నిర్వహిస్తారని 29న అనుపోత్సవం ఉంటుందని తెలిపారు. సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 42 ఎస్‌ఐలతో సహా మొత్తం 700 పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



హాజరైన వివిధ శాఖల అధికారులు

ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్



- ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం
- గతంలో టీడీపీ హయాంలో ప్రారంభం
- నిలిపివేసిన జగన్ ప్రభుత్వం
- పునరుద్ధరిస్తున్న కూటమి సర్కారు

రాజాం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు శుభవార్త. ఇక నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలుకానుంది. గతంలో టీడీపీ ప్రభుత్వమే కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు, డ్రాపౌట్లు నియంత్రించేందుకు, పౌష్టికాహార లోపం నివారణకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టింది. 2014 నుంచి 2019 వరకూ అమలుచేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ సర్కారు ఈ పథకాన్ని నిలిపివేసింది. అమ్మఒడి అందిస్తున్నామన్న సాకు చూపి విద్యార్థులకు కీలకంగా అవసరమైన పథకాన్ని ఆపేసింది.

ఐదేళ్లలో అస్తవ్యస్తం..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్య దారుణంగా తయారైంది. ఉత్తీర్ణత శాతం పడిపోయింది. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడం, కాలేజీల్లో వసతులు తగ్గడం వంటి కారణాలతో అడ్మిషన్లు తగ్గిపోయాయి. బోధనా ప్రమాణాలు లేక ఫలితాలు పడిపోయాయి. సాధారణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చదివేది నిరుపేదలే. ప్రస్తుతం ప్రతీ మండలంలో ప్రైవేటు కాలేజీల హవా నడుస్తోంది. దీనికితోడు కార్పొరేట్ కాలేజీలు రాజ్యమేలుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలలు వాటి పోటీకి తట్టుకోలేకపోతున్నాయి. చాలా కాలేజీల్లో అడ్మిషన్లు సైతం తగ్గుముఖం పట్టాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేసే ప్రయత్నం జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వం పెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని సైతం వైసీపీ సర్కారు రద్దు చేసింది. మళ్లీ ప్రారంభిస్తామని చెప్పినా ఐదేళ్లు కాలయాపన చేసింది.



ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 32 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. విజయనగరంలో 18, పార్వతీపురం మన్యంలో 14 కాలేజీలు కొనసాగుతున్నాయి. సంప్రదాయ కోర్సులతో పాటు టెక్నికల్ కోర్సులను సైతం అందుబాటులోకి తెచ్చారు. అయినా విద్యార్థుల నుంచి ఆ స్థాయిలో ఆదరణ లభించడం లేదు. మొత్తం ఉమ్మడి జిల్లాలో 11 వేల మంది వరకూ విద్యార్థులు చదువుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకం ప్రవేశపెట్టింది. ఇది విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనకారిగా నిలిచింది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత దీనిని నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించనుంది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..

జిల్లాలో విద్యార్థుల సంఖ్య..ఏయే కాలేజీల్లో ఎంత మంది చదువుతున్నారు.. అన్న వివరాలు సేకరించాం. అందులో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంతమంది? వంట పాత్రలు ఎన్నికావాలి? అనేది సమగ్రంగా వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

-మంజులావీణ, డీఐఈవో

శుభ పరిణామం..

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి అవకాశం. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.సుదూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్నాం. మాలాంటి వారి కోసం కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తుండడం శుభ పరిణామం. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

-రమాదేవి విద్యార్థి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, రాజాం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..

మారుమూల గ్రామాలకు సరైన రవాణా సదుపాయం లేదు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరితే కానీ కాలేజీకి చేరుకోలేం. మేము బయలుదేరే సమయానికి వంట కాదు. మాలాంటి వారి కోసం మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలని భావించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు

-పద్మావతి, విద్యార్థిని, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, రాజాం

జడ్పీ ఆవరణలో వైసీపీ కార్యక్రమం

- ఆందోళనల పోస్టర్ ఆవిష్కరించిన ఆ పార్టీ నాయకులు
- కొన్నాళ్లుగా రాజకీయాలకు వేదికగా మారిన కార్యాలయం



జడ్పీ అవరణలో వైసీపీ నిరశన కార్యక్రమాల ఫోస్టర్‌ను అవిష్కరిస్తున్న వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జడ్పీ కార్యాలయం రాజకీయ కార్యక్రమాలకు వేదికగా మారుతోంది. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కావడంతో ఎప్పటికప్పుడు జడ్పీని పార్టీ కార్యక్రమాలకు వేదికగా మార్చుకుంటున్నారన్న ఆరోపణ బలంగా వినిపిస్తోంది. తాజాగా వైసీపీ చేపట్టదలచిన ఆందోళన కార్యక్రమాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఇది చూసిన కార్యాలయ సిబ్బంది ఇదేం సంస్కృతి అని విస్తుపోయారు. ప్రశ్నించే ధైర్యం చేయలేక విన్నకుండిపోయారు.

వైసీపీకి ప్రత్యేకంగా జిల్లా కార్యాలయం లేదు. విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీ ఎన్నికల ముందువరకు కోలగట్ల వీరభద్రస్వామి ఇంటిని కార్యాలయంగా వినియోగించేవారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురజాడ రోడ్డులో వున్న సత్య లాడ్జిలో రెండు గదులను వైసీపీ కార్యాలయంగా మార్చి అక్కడ ప్రెస్‌మీట్లు పెట్టేవారు. ఏం జరిగిందో కానీ ఇప్పుడు అక్కడకు వెళ్లడం లేదు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రెస్‌తో మాట్లాడాలన్నా, ముఖ్య నాయకులతో సమావేశం కావాలన్నా ప్రదీప్‌నగర్‌లో ఉన్న ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసం నుంచే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కాగా పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న శ్రీనివాసరావు రాష్ట్ర పార్టీ పిలుపు ఇచ్చే కార్యక్రమాలు ఏమైనా జడ్పీ కార్యాలయం వేదికగా స్పందిస్తున్నారు. ఉద్యోగులు విధులు నిర్వహించే ఆ ప్రాంతంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించకూడదన్న నిబంధన ఉంది. కానీ జడ్పీ చైర్మన్ అవేవీ పట్టించుకోకుండా తాను ఏమి చేసినా చెల్లుతుందన్న భావనతో అక్కడి నుంచే రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం విధానాలపై ధ్వజమెత్తుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో భాగంగా వైసీపీ త్వరలో చేపట్టబోయే నిరసన కార్యక్రమాల పోస్టర్‌ను జడ్పీ ఆవరణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. వారి వాహనాలతో జడ్పీ ప్రాంగణం నిండిపోయింది. దీంతో జడ్పీ అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ కార్యాలయంలో ఇదేం వరస అంటూ గుసగుసలాడుకున్నారు.

పది లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

- తమిళనాడు యువకుడు సైకిల్‌యాత్ర

సీతంపేట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి)

పర్యావరణ పరిరక్షణ హితం కోరి సైకిల్‌యాత్ర చేస్తున్నట్లు తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన యువకుడు ముత్తా సెల్వన్ చెప్పాడు. ఇందు కోసం 10లక్షల మొక్కలను తాను పర్యటిస్తున్న ప్రాంతాల్లో నాటించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపాడు. బుధవారం కొత్తూరు మీదుగా సీతంపేట మండలంలో పర్యటించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కరోనా సమయంలో ఆక్సిజన్ లేక అనేక మంది మృతిచెందారని తెలిపాడు. ఇప్పటివరకు 4.5లక్షల మొక్కలు నాటించినట్లు చెప్పాడు. 2021లో సైకిల్‌పై మొదలైన తన ప్రయాణం 2025లో ముగుస్తుందని పేర్కొన్నాడు.



సైకిల్‌యాత్ర చేస్తున్న ముత్తా సెల్వన్

న్యూస్ బాక్స్

నేడు ద్వారం సంస్మరణ సభ

విజయనగరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల కచేరీ మందిరంలో గురువారం సాయంత్రం ద్వారం వెంకటస్వామి నాయుడు సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్ శాస్త్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వయోలిన్ కచేరీ ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గంట స్తంభం ప్రాంతంలో నిబంధనలు అతిక్రమించి చేపడుతున్న నిర్మాణాలను బుధవారం ప్రణాళిక సిబ్బంది తొలగించారు. ప్రధాన జంక్షన్‌లలో జాగాను అక్రమించి నిర్మిస్తున్న దుకాణాలను కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో తొలగించారు. కార్యక్రమంలో టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం

గరివిడి(చీపురుపల్లి), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి మండలం ఆకులపేటలో బుధవారం మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు గోవిందరాజు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 34 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొళాయిల ఏర్పాటు

రేగిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంకిలి గ్రామంలో కొత్తగా మరికొన్ని రక్షిత మంచి నీటి కొళాయిలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ పట్టాభి వీటిని బుధవారం ప్రారంభించారు. ప్రజలందరికీ కొళాయిలను అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నారు.

పారిశుధ్య కార్యక్రమాలు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో పూడిక తీత పనులను పారిశుధ్య బృందం చేపడుతున్నారు. బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లోని కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ, కాలువల ప్రక్షాళనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

కళాశాలలో వర్క్‌షాప్

నెల్లిమర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు భౌతిక శాస్త్రంలోని వివిధ అంశాలపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జోగా చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, కోట రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోంపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు బుధవారం పరిశీలించారు. తెలుగు పరీక్ష నిర్వహణ తీరును చూశారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బీపీఏ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు అందజేత

జామి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామికి కస్తూరిబా టైప్-4 బాలికల హాస్టల్ మంజూరైంది. ఈ ఉత్తర్వులను జామి మండల విద్యాశాఖాధికారి -2 గంగరాజు, మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు బుధవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి అందజేశారు.

వెలుగు సభ్యులకు శిక్షణ

సంతకవిటి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య వ్యూహం అమలుపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజులు నిర్వహిస్తామని తెలిపారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

కొత్తవలస, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2025 నాటికి క్షయ వ్యాధిని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ ప్రియ అన్నారు. బుధవారం ఆమె కాటకాపల్లిట ప్రజలకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్ వర్మ, సీతా మహాలక్ష్మి, సిబ్బంది అప్పలకొండ, రవణమ్మ, బేబీరాణి, సూరిదేముడు, గోపీశ్రీనివాస్ పాల్గొన్నారు.

షాపులకు తాళాలు

రాజాం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో మొండి బకాయిలు ఉన్న వారి షాపులకు తాళాలు వేసినట్లు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మొండి బకాయిలు వసూలు చేయడానికి వెళితే నిర్వాహకులు చెల్లించడానికి నిరాకరించారని తెలిపారు.

కొనసాగిన దీక్ష

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విధుల నుంచి తొలగించారంటూ నగరంలో అంగన్‌వాడీ హెల్పర్ సౌజన్య చేపట్టిన నిరసన దీక్ష బుధవారం మూడో రోజు కూడా కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అనుసూయ, రవి కుమార్, సుధారాణి, ఆనంద, వీవీ లక్ష్మి, పట్టణ పౌర సంక్షేమ కార్యదర్శి రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

రహదారులపై గోతులతో ప్రమాదాలు

రాజాం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజాంలోని శ్రీకాకుళం రోడ్డు, బొబ్బిలి రోడ్డు మరమ్మతులకు గాను గోతులు తవ్వి.. అర్థాంతరంగా వదిలేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండూ ప్రధాన రహదారులు కావడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సుమారు ఐదేళ్ల కిందట వేసిన ఈ రహదారి పూర్తిగా పాడవడంతో యంత్రాలతో గొయ్యి తవ్వించి... కొత్తగా తారు రోడ్డు వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆ గోతులు పూడ్చకపోవడంతో ఇప్పుడు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో ప్రమాదకరంగా గొయ్యి

క్రైం కార్నర్

గూడ్సు రైలు ఢీకొని వ్యక్తి మృతి

గరివిడి(చీపురుపల్లి), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):చీపురుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం గూడ్సు రైలు ఢీకొని ఇప్పిలి జగదీష్ అనే వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొమరాడ మండలంలో...

బెలగాం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలోని కోటిపాం రైల్వే గేట్ సమీపంలో బుధవారం గూడ్స్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ హెచ్‌సీ రత్నకుమార్ కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి మతిస్థిమితం లేకుండా రెండు రోజులుగా కోటిపాం పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నాడు. బుధవారం పట్టాలపైకి వెళ్లగా రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

20 లీటర్ల సారా స్వాధీనం

వీరఘట్టం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనస నందివాడలో బుధవా రం 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని . కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కళానిధి తెలిపారు. సారా అమ్మకాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం

లక్కవరపుకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని, రైతుల కష్టాలను తీరుస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం ఆమె ఎల్.కోటలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. చెరువుల ఆయకట్టు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రిని కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ ప్రతినిధులు బుధవారం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటూరి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం శరవేగంగా అభివృద్ధి చెందడం అభినందనీయమన్నారు. ఉచితంగా ఇసుకను అందజేయడం ద్వారా నిర్మాణ రంగం ఊపందుకుందని తెలిపారు.



ముఖ్యమంత్రితో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్

నిర్వాసితుల కోసం న్యాయ పోరాటం

శృంగవరపుకోట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల కోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్టు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చెప్పారు. బుధవారం చినఖండేపల్లిలో తహసీల్దారు అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక యువత రఘురాజును ఉద్దేశించి మాట్లాడుతూ 'మీరు చెబితే మా పెద్దలు 16 ఏళ్ల క్రితం జిందాల్ పరిశ్రమ కోసం భూములు ఇచ్చార'ని తెలిపారు. పరిశ్రమ రాకపోవడం వల్ల దినసరి కూలీలుగా మారిపోయామన్నారు. దీనిపై ఎమ్మెల్సీ మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి మాట నమ్మి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో జిందాల్ కోసం భూసమీకరణ చేయించామన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే మంత్రులందరికీ వివరించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యం, సబ్‌రిజిస్ట్రార్ కల్యాణి, ఆర్ఐ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

100 రోజుల ప్రణాళికలో మినహాయింపులివ్వాలి

విజయ నగరం, కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా సెలవు దినాలు, ఆదివారం పూట మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, ఏపీటీఎఫ్ నాయకులు విడివిడిగా బుధవారం డీఈవో మాణిక్యం నాయుడును కలిసి వినతి పత్రం అందించారు. సెలవు రోజున, ఆదివారం పూట తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వివరించారు. ఆ రోజుల్లో 50 శాతం కంటే విద్యార్థులు తక్కువగా హాజరవుతున్నారని డీఈవో దృష్టికి తీసుకుని వచ్చారు. ఇదిలా ఉండగా ఎస్ఏ 1 పరీక్షల పేపర్లు ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం ఎంఆర్‌సీలు తీసుకుని వెళ్లడం వల్ల వ్యయ ప్రయాసలకు గురవుతున్నామని వివరించారు. ఉదయం ఒక్క పూట మాత్రమే ప్రశ్నపత్రాలు తీసుకుని వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ విరమణ ద్వారా ఏర్పడిన సబ్జెక్టు టీచర్ల ఖాళీలను వెంటనే సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ కార్యదర్శి టి.సన్యాసిరాజు, ఏపీటీఎఫ్ నాయకులు డి.ఈశ్వరరావు, శ్రీనివాసరావు, పైడిరాజు, వీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీటు నాయకులు బి.సూర్యనారాయణ అన్నారు. భోగాపురం మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ.15వేలు ఇవ్వాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా మోనూ చార్జీలు రూ.20కి పెంచాలని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించాలని కోరారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులు రమణమూర్తి, చంద్రమౌళిలకు వినతిపత్రం అందజేశారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

కొత్తవలస, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల దోపిడీని ఆదిలోనే అడ్డుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తవలసలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అధికారంలోకి రాక ముందు కూటమి నాయకులు విద్యుత్ చార్జీలను పెంచబోమని.. తగ్గిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పారని ఆరోపించారు. ఈ మీటర్లను తొలుత ప్రభుత్వ కార్యాలయాలలో పెట్టారని, ఇప్పుడు షాపులు, సంస్థల్లో బిగిస్తున్నారని అన్నారు. ఆ తరువాత ఇళ్లకు బిగిస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గాడి అప్పారావు, జి.కృష్ణమూర్తి, పీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం నిర్మించే వరకూ ఉద్యమం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించేంత వరకూ ఉద్యమిస్తామని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని కోరుతూ సంస్కృత కళాశాల వద్ద బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జయపాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

లేగ దూడల ప్రదర్శన

భోగాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నందిగాంలో బుధవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించాయి. 66 పశువులకు చికిత్స అందించారు. పాడి రైతులు తీసుకొచ్చిన 48 లేగదూడలలో ఆరోగ్యంగా ఉన్న వాటిని గుర్తించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ వైవీ రమణ, ఉపసంచాలకులు రాధాకృష్ణ, ఎస్.దామోదరరావు, ఉమాశంకర్ మహాపాత్రో, సర్పంచ్ మురళీమోహనరావు, మిరాకిల్ సీఈవో లోకంప్రసాద్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత విశిష్టతను తెలుసుకోవాలి

నెల్లిమర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత శ్లోకాలను, వాటి భావాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్, జనసేన పార్టీ నాయకులు చనమల్లు వెంకటరమణ అన్నారు. నెల్లిమర్ల పద్మశాలి వీధిలోని భక్త మార్కండేయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గీతా జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భక్త మార్కండేయ ఆలయంలోని శ్రీకృష్ణుడి విగ్రహానికి చనమల్లుతో పాటు స్థానికులు పూజలు చేశారు. గీతా పారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సంఘం ప్రతినిధులు పొన్నగంటి కృష్ణ, ఆర్ధి మధుబాబు, కల్లూరు మహేష్, కొండేటి రమేష్, మాడిమి అప్పారావు, కొల్లి రమణమూర్తి, వానపల్లి వీరభద్రరావు, కానూరు రమణ తదితరులు పాల్గొన్నారు.



గరివిడి: మాట్లాడుతున్న సరస్వతి స్వామి

మన కర్తవ్యం..

శృంగవరపుకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనం ప్రతి భారతీయుని కర్తవ్యమని మోక్ష విద్య యోగా మందిర్ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు అన్నారు. గీతాజయంతి సందర్భంగా బుధవారం ఇంటింటికి భగవద్గీతను పంపిణీ చేశారు. భగవద్గీత పుస్తకాలు ఉచితంగా కావలసిన వారు 99893 68781, 98667 57311 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తాటిగూడలో ..

గరివిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాటిగూడ గ్రామంలోని శ్రీబ్రహ్మ విద్య కుటీరంలో బుధవారం గీతాజయంతి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పుణ్యగిరికి చెందిన స్వామి నిత్యాతృప్తానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మికతను అలవర్చుకున్నప్పుడే జీవితంలో ప్రశాంతంగా ఉండగలరన్నారు. గీతా పారాయణం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో కుటీరం వ్యవస్థాపకులు వాకాడ శ్రీను, స్వామి ప్రకాశనంద సరస్వతి, సరస్వతి మాతాజీ, ప్రబల సుబ్రహ్మణ్య శర్మ, వాకాడ జయలక్ష్మి, స్వామి సుమిత్రానంద సరస్వతి తదితరులు పాల్గొన్నారు. గరివిడి, తాటిగూడ, గెడ్డపువలస తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

తప్పుడు ఫోన్ కాల్స్‌తో జాగ్రత్త

లక్కవరపుకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ఫోన్ కాల్స్‌తో ప్రజలు మోసపోవద్దని ఎల్.కోట ఎస్ఐ నవీన్‌పడాల్ సూచించారు. బుధవారం రాత్రి కల్లేపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, గంజాయి, వాట్సప్ మోసాలు, బెల్టుషాపులు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జక్కాన కన్నబాబు, జె.సింహాద్రప్పుడు, వెంకటలక్ష్మి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

శృంగవరపుకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శాఖా గ్రంథాలయంలో బుధవారం సైబర్ నేరాలపై విజయనగరం లీడ్ బ్యాంకు మేనేజర్ వి.వి.రమణ మూర్తి అవగాహన కల్పించారు. పుస్తకాలను ఉచితంగా అందించారు. శాఖా గ్రంథాలయ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

అనధికార క్వారీలపై చర్యలు

విజయనగరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనధికార క్వారీలు, ఇసుక, మెటల్ అక్రమ రవాణాపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గనులు, భూగర్భశాఖ ఉత్తరాంధ్ర విజిలెన్స్ విభాగం ప్రాంతీయ అధికారి బి.అశోక్‌కుమార్ హెచ్చరించారు. విజయనగరం విజిలెన్స్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. విజయనగరం ఉమ్మడి జిల్లా పరిధిలో గత నెల రోజుల వ్యవధిలో మెటల్‌ని అక్రమ రవాణా చేస్తున్న వారి నుంచి రూ.7 లక్షల 50 వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారినుంచి రూ.2.75లక్షలు, గ్రానైట్‌కు సంబంధించి రూ.1.78లక్షలు వసూలు చేసినట్టు తెలిపారు.

అభివృద్ధే లక్ష్యం కావాలి

గుర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీడీవో శేషుబాబు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు, సర్పంచ్‌లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

గజపతినగరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) ప్రజలకు అన్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిరసన గళం విప్పి ప్రజలకు అండగా ఉండాలన్న ధ్యేయంతో ఈనెల 13న కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బూవి వెంకటరావు, కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచింది

విజయనగరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి రైతులను నట్టేట ముంచిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. జెడ్పీ చైర్మన్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కె.వి.సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడుబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు వైసీపీ ధర్నా

కొత్తవలస, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఈ నెల 13 జరిగే ధర్నా కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు హాజరు కావాలని శృంగవరపుకోట మాజీ శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు కోరారు. బుధవారం కొత్తవలసలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు దగా

రాజాం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆరోపించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్బీకేల ద్వారా రైతులకు అన్నిరకాల సేవలు అందించేవారని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ఈనెల 13న వైసీపీ ధర్నా చేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జి డా.తలే రాజేష్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు.

బెల్టుషాపులకు వేలం నిర్వహిస్తే కఠిన చర్యలు

విజయనగరం క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా బెల్టుషాపుల కోసం వేలం పాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు అధికారులను ఆదేశించారు. బుధవారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార మద్యం దుకాణాలపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నాటు సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌డీపీఎల్ రాకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బమ్మిడి శ్రీనాథుడు, డిపో మేనేజరు గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీ బాబ్జీరావు

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి శారదాంబ

రాజాం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతోనే కేసుల పరిష్కారానికి అవకాశాలు ఉన్నాయని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. సివిల్ కేసులతో పాటు భార్యాభర్తల తగాదాలు, ఇతర కేసులు పరిష్కరించవచ్చని అన్నారు. సీనియర్ న్యాయాధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె ఇక్కడి కోర్టు ప్రాంగణంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భార్యాభర్తల తగాదాలలో మధ్యవర్తిత్వం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలపై ఐటీడీఏ శీతకన్ను

(ఐదో పేజీ తరువాయి)

కిందకి దిగాలన్నా సాహసంతో కూడుకున్న ప్రయాణమే. దగ్గర దగ్గరగా రోడ్డు మలుపులు ఉండడంతో పర్యాట కులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు వంటివి ఏర్పాటు చేయకపోవడంపై సందర్శకులు మండిపడుతున్నారు.

ఆదాయం బాగానే ఉన్నా..

ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కు, మెట్టుగూడ జలపాతం నుంచి ఈ సీజన్‌లో ఒక్క వీకెండ్ ఆదివారం వచ్చే ఆదాయం రూ.3లక్షల పైగానే ఉంది. శని, ఆదివారాల్లో సందర్శకులు పోటెత్తడంతో ఆదాయం కూడా ఆ స్థాయిలోనే వస్తోంది. మొత్తంగా ఏడాదిలో నవంబరు నుండి ఫిబ్రవరి వరకు వచ్చే ఆదాయం రూ.40లక్షల వరకు వస్తోంది. ఇంత ఆదాయం వస్తున్నా.. పార్కులో సాహస క్రీడా యంత్రాలను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీంతో సందర్శకులు నిరాశ చెందుతున్నారు. దీనిపై ఐటీడీఏ స్పందించకుంటే.. రానున్న రోజుల్లో పర్యాటకుల సంఖ్య తగ్గడంతో పాటు ఆదాయం కోల్పోయే అవకాశం ఉంది. పర్యాటక ప్రాంతాల పై ఆధారపడి జీవిస్తున్న గిరిజన యువత ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని గిరిజన సంఘాలు వాపోతున్నాయి.

ఇన్‌చార్జి పీవో ఏమన్నారంటే..

ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన మెసేజ్ రూపంలో సమాధానమిచ్చారు. పర్యాటక ప్రాంతాల్లో కొత్తగా ఏం చేస్తున్నామనే సమాచారం కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పీఆర్ఏ రంజిత్‌ని అడిగి తెలుసుకోవాలన్నారు. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో ఆల్ టెర్రయిన్ వెహికిల్స్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని, పారా మోటరింగ్ కూడా నిర్వహిస్తామని చెప్పారు.

రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం

● పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



సీతానగరం: మాట్లాడుతున్న విజయచంద్ర

సీతానగరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మంజూరైన బీటీ రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులను ఈనెలాఖరులోగా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బుధవారం సీతానగరం బజారులో రహదారి మరమ్మతుల కోసం శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. సీతానగరంలో సువర్ణముఖి నదిపై వంతెన పనులు మార్చి 31లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ప్రజాదర్బార్

పార్వతీపురం రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రజాదర్బార్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలతోపాటు పార్వతీపురం పట్టణం నుంచి తాగునీరు, రహదారులు తదితర సమస్యలపై పలువురు వినతిపత్రాలను అందజేశారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీఇచ్చారు.

ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తిచేయండి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ

వీరఘట్టం,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బి.వెంకట రమణ కోరారు. బుధవారం మండలంలోని చిట్టిపుడివలస గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎన్‌పీసీఐ యాక్టివేషన్,హౌస్ హోల్డ్ జియో ట్యాకింగ్, పల్లెపండుగ పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

బెలగాం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నందున గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులను అక్రమంగా ఇతర జిల్లాలకు డిప్యుటేషన్ వేయడం తగదని, తక్షణమే రద్దుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ కోరారు. బుధవారం పార్వతీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు ఒక్కొక్కరే ఉన్నారని, వారిని డిప్యుటేషన్ వేస్తే వారు పనిచేస్తున్న పాఠశాలల విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధిస్తారని ప్రశ్నించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని కూడా డిప్యుటేషన్ వేయడం తగదని తెలిపారు. సమ్మె సమస్యలకు పరిష్కారం చూపాలి తప్ప ఉపాధ్యాయుల హక్కులను కాలరాయడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే డిప్యుటేషన్లు రద్దు చేయకపోతే ఐటీడీఏ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో గిరిజన గురుకుల సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలను గురుకుల పాఠశాలలకు వివిధ జిల్లాల్లో డిప్యుటేషన్లు వేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు. గురుకులాల్లో ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులకు చదువులు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

వృద్ధురాలి మెడలో బంగారం చోరీ

పార్వతీపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద బొండపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు వంగపండు అన్నపూర్ణమ్మ మెడలో రెండు తులాల బంగారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అన్నపూర్ణమ్మ మెడలోని బంగారాన్ని ఇంట్లోకి వెళ్లి మంగళవారం రాత్రి తెంపుకొనిపోయారు. ఈమేరకు రూరల్ పోలీసులు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోలీసులు దర్యాప్తుచేశారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం కావాలి

బొబ్బిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మానవ హక్కుల పరిరక్షణే మనందరి ధ్యేయం కావాలని, ఇందుకోసం ప్రతిఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని రోటరీ, కారుణ్య సంస్థల చైర్మన్ జేసీ రాజు పిలుపునిచ్చారు. ప్రపంచ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బొబ్బిలి కళాశాల వసతిగృహంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషికి అనేక హక్కులతో ప్రశాంతంగా జీవించే హక్కు ఉందన్నారు. విద్యార్థులకు మానవ హక్కులపై సంపూర్ణమైన అవగాహన కలిగిఉండాలని పిలుపునిచ్చారు.



మానవహక్కులపై నినాదాలు చేస్తున్న విద్యార్థులు

నిర్వహణ లేక.. వినియోగానికి నోచుకోక

● ఇదీ వీరఘట్టంలో వ్యక్తిగత మరుగుదొడ్ల పరిస్థితి



చాకలివీధిలోని మరుగుదొడ్లల్లో సామగ్రి నిల్వచేసిన దృశ్యం

వీరఘట్టం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):వీరఘట్టం పంచాయతీలో నిర్వహణలేకపోవడంతో వ్యక్తిగత మరుగుదొడ్లు నిరుపయోగంగామారాయి. చాకలి,జనవీధుల్లో ఓడీఎఫ్‌లో భాగంగా శతశాతం మరుగుదొడ్లు నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం లక్ష్యం నిర్ధేశించింది. అయితే ఆయా వీధుల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించేందుకు స్థలాలు లేకపోవడంతో ఆధార్, రేషన్‌కార్డు ఆధారంగా స్థలాన్ని సేకరించి సామూహికంగా అప్పట్లో మరుగుదొడ్లు నిర్మించారు.ప్రధానంగా రన్నింగ్‌వాటర్ సమస్య వల్ల మరుగుదొడ్లు వినియోగంలోకి రాలేదు. అధికారులు బోరుబావి ఏర్పాటుచేసినా మోటారు కనెక్షన్ ఇవ్వకపోవడంతో చాకలి, జనవీధుల ప్రజలు మరుగుదొడ్లు వినియోగానికి వీల్లేకుండాపోయాయి.ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడంతో సామగ్రి నిల్వకు ఈ మరుగుదొడ్లను వినియోగించుకున్నారు. తక్షణమే రన్నింగ్ వాటర్ సమస్య పరిష్కరించి వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. కాగా మరుగుదొడ్లు వివరాలు సేకరించి వినియోగంలోకి తీసుకువస్తామని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



నిచ్చెనపైకి ఎక్కి అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవల్సిన చర్యలను వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతంపేట రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలోని ఏపీఆర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ కళాశాలలో బుధవారం అగ్ని ప్రమాదాలనివారణపై పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వంటకు ఉపయోగించే లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లీకేజీ గుర్తించిన తర్వాత లీకైన గ్యాస్ వాతావరణంలో 1.8శాతం కంటే తక్కువ శాతానికి వచ్చే వరకు లీకేజీ జరిగిన దగ్గర ఎటువంటి విద్యుత్ ఉపకరణాలు ఆన్ లేదా ఆఫ్ చేయాలన్న అంశాలపై వివరించారు. అపార్ట్‌మెంట్లల్లో అగ్ని ప్రమాదం జరిగే సమయంలో చిక్కుకున్న వారిని లేడర్ ద్వారా తరలించే పద్ధతిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.కృష్ణమోహన్, వైస్ ప్రిన్సిపాల్ పి. విజయలక్ష్మి పాల్గొన్నారు.

అపరాల సాగుతో అధిక ఆదాయం

● ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ డైరెక్టర్ ప్రకాశ్



అపరాల శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకాశ్

గరుగుబిల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో అపరాల సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం రీజనల్ డైరెక్టర్ కె.ప్రకాశ్ తెలిపారు. బుధవారం తోటపల్లి జట్టు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల వాతావరణ కాలుష్యం నియంత్రణతో పాటు ప్రకృతిని పరిరక్షించవచ్చని తెలిపారు. రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ మాట్లాడుతూ రైతులు విధిగా విత్తనశుద్ధి చేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జి వి.పోలినాయుడు, వెంకటనాయుడు, శిక్షకులు శ్రీరామ్, ఎం.గౌరునాయుడు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఈ రంగారావు

మక్కువ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణలో పీఎం సూర్యఘర్ కార్యక్రమంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్‌పై ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. రాయితీతో కూడిన సోలార్‌రూఫ్‌టాప్‌ను ఇళ్లపై నిర్మించుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గుతాయని వివరించారు. కార్య క్రమంలో విద్యుత్‌శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వి.రంగారావు, ఏఈ జోగినాయుడు, టీడీపీ నాయకులు మావుడి ప్రసాదరావు పాల్గొన్నారు.

బొబ్బిలిలో గీతా పారాయణం



బొబ్బిలి: గీతామండపంలో గీతాపారాయణం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని పూల్‌బాగ్ గీతామండపంలో బుధవారం గీతా జయంతి పురస్కరించుకొని హిందూ ఉత్సవసమితి ఆధ్వర్యంలో గీతాపారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు పెంట స్వామినాయుడు ఆధ్వర్యంలో 18 అధ్యాయాల భగవద్గీతను పారాయణం చేశారు. కార్యక్రమంలో మండపం నిర్వాహక ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీతతో మహనీయుల ప్రేరణ

భగవద్గీతతో రామకృష్ణ పరమహంస, వివేకానంద, మహాత్మాగాంధీ, అరబిందో వంటి మహనీయులు ప్రేరణ పొందారని సీఐ కటకం సతీష్‌కుమార్ తెలిపారు. బొబ్బిలి పోలీసుస్టేషన్‌లో గీతా జయంతి పురస్కరించుకుని మునిసిపల్ టీడీపీ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు, రోటరీప్రతినిధులు జేసీరాజు, శ్రీనివాసన్ సీఐ, ఎస్ఐలు, పోలీసులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.వేణుగోపాలస్వామి ఆలయంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.

● పాలకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగవంశపు వీధిలోని రామాలయంలో గీతాజయంతి పురస్కరించుకుని భగవద్గీత పారాయణం, సత్సంగం నిర్వహించారు. భగవద్గీత ప్రచారకులు కంచుమోజు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో జల్లు నారాయణరావు, దాసిరెడ్డి యోగేశ్వరరావు, బోను చిన్నమ్మలు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. చిన్నమ్మ ఆధ్వర్యంలో నారాయణసేవ నిర్వహించారు. జల్లు నారాయణరావు, జల్లు వెంకటేష్ 108 భగవద్గీత పుస్తకాలను పెద్దకాపువీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. పరశరాంపురంలో గీతాసత్సంగం నిర్వహించారు.

శ్మశాన వాటిక రహదారికి స్థలం కేటాయింపు



శ్మశాన వాటికకు వెళ్లే దారిని పరిశీలిస్తున్న ఆర్డీవో రామమోహనరావు

బొబ్బిలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని డొంగురవలసలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారికోసం స్థలం కేటాయించారు.శ్మశానవాటికకు రైతు పి.అప్పారావుకు చెందిన జిరాయితీ భూమిలో నుంచి గ్రామస్థులు దారి ఏర్పాటు చేసుకున్నారు. అయితే అప్పారావు అభ్యంతరం తెలియజేయడంతో తరచూ గ్రామస్థులతో వాగ్వాదం జరిగేది. ఈనేపథ్యంలో బుధవారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామస్థులు ఆర్డీవో రామమోహనరావుకు శ్మశాన వాటికకు స్థల సమస్యను వివరించారు. దీంతో ఆయన శ్మశాన వాటిక పరిశీలించి పది సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయించారు. ఇకపై జిరాయితీ భూమిలోని దారి గుండా వెళ్లవద్దని, ఈ స్థలంలో రాహదారి ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఆర్ఐ రామకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడాలి

సాలూరు,డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను కాపాడుకోవాలని సాలూరు ఫారెస్ట్‌రేంజర్ ఆఫీసర్ కె.తవిటినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో అటవీశాఖ అధికారి కార్యాలయంలో వన్యప్రాణులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడం, గాయపరచడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గంగరాజు, దేవరాజు పాల్గొన్నారు.

డీలరు పోస్టులకు నోటిఫికేషన్ జారీ

బొబ్బిలి డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో 30 రేషన్ డిపో డీలరు పోస్టులకు బుధవారం ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు నోటిఫికేషన్ జారీచేశారు.ఈ మేరకు బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న 27 డీలరు పోస్టులతోపాటు, అదనంగా మరో ఏడుపోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.800 రేషన్‌కార్డుల సంఖ్య దాటిన ప్రతిచోట కొత్తగా డిపోలను మంజూరుచేశామని చెప్పారు. ఈ మేరకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 18 లోగా దరఖాస్తు చేసుకోవాలని, 19న దరఖాస్తుల పరిశీలించి, 20న దరఖాస్తుదారుల జాబితా వెల్లడించనున్నట్లు తెలిపారు. 26న రాత పరీక్ష, 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 30న ఎంపికైన డీలర్ల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ పాల్గొన్నారు.

కిరాణా దుకాణాలు ఉండరాదు

●18 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఉండి ఇంటర్ ఉత్తీర్ణులై, స్థానిక నివాసులు దరఖాస్తుచేసుకోవచ్చు.●దివ్యాంగులు మండలపరిధిలోని డీలరు పోస్టులకు ఎక్కడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇంటర్ అర్హత లేని చోట, ఫెయిలైన వారు కూడా అర్హులే.● దరఖాస్తుదారులు సరుకులు విడిపించుకునే ఆర్థిక స్థోమత ఉండాలి. ఎటువంటి పోలీసు కేసులు ఉండరాదు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు కూడా దరఖాస్తుచేసుకోవచ్చు. ● డీలరు పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి గాని, వారి బంధువులకు ఎటువంటి కిరాణా దుకాణాలు ఉండరాదు. ● స్థానిక సంస్థలు, సహకార సంఘాల్లో పదవుల్లో ఉన్న వారు దరఖాస్తు చేసుకోరాదు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఎంపీడీవో రవికుమార్ కోరారు. బుధవారం బొబ్బిలిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయసిబ్బందికి గ్రామాల అభివృద్ధిపై ప్రణాళికలు అన్న శిక్షణ నిర్వహించారు.ఈసందర్భంగా ఈవోపీఆర్డీ భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాల్లో మరుగుదొడ్లు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రఘువంశి, ఏవో శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

శారదకు జాతీయ ఉమెన్ ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శారద

బొబ్బిలి డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలికి చెందిన సామాజిక సేవాకార్యకర్త, విద్యావేత్త డాక్టర్ చింతా శారద మానవహక్కుల మండలి ద్వారా చేస్తున్న సేవలకు గాను జాతీయ ఉమెన్ ఐకాన్ అవార్డును అందుకున్నారు. దక్షిణ భారత ప్రపంచమానవ హక్కుల మండలి అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న శారద బుధవారం యూపీలోని లక్నో ఇంటర్నేషనల్ బౌద్ధశోధ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బ్రిజేష్ పతక్, మంత్రి జైవీర్‌సింగ్, వైస్‌చాన్సలర్ డాక్టర్ సోనియా నిత్యానంద్‌ల చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. భారత్ గౌరవ్ అవార్డు-2024 కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డుల ప్రదానం చేశారు. శారదకు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

మక్కువలో ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

మక్కువ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మక్కువ మరనాత చర్చిలో మండల పాస్టర్ల ఆధ్వర్యంలో ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఏసు క్రీస్తు సందేశాన్ని విశ్వాసకులకు వివరించారు. అనంతరం పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ప్రసంగీకులు జి.ఆర్.నాగూరి ఆజార్య, మండల పాస్టర్స్ ప్రెసిడెంట్ ఎస్.జయరాజు, పాస్టర్స్, విశ్వాసకులు పాల్గొన్నారు.

విగ్రహానికి ముసుగులు తొలగించకపోవడంతో నిరసన

బొబ్బిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు వేసిన ముసుగులు తొలగించకపోవడంతో బొబ్బిలిలో మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ ఖాన్ వినూత్నంగా నిరసన తెలిపారు. బొబ్బిలి అమ్మిగారి కోనేరు గట్టుపై గల దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగును తొలగించాలని రియాజ్ ఖాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించకపోవడంతో ఆయన బుధవారం ఆ ముసుగును తొలగించారు. విగ్రహానికి పాలాభిషేకం చేసి అధికారుల తీరుకు వ్యతిరేకంగా వినూత్నంగా నిరసన తెలియజేశారు.కార్యక్రమంలో సోషల్‌మీడియా కోఆర్డినేటర్ ఉదయ్‌కిరణ్ నాని పాల్గొన్నారు.

పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా జేసీ

పార్వతీపురం, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా జాయింట్ కలెక్టర్ శోభిక నియామకమయ్యారు. ప్రస్తుత సబ్ కలెక్టర్, ఇన్‌చార్జి పీవోగా ఉన్న అశుతోష్‌శ్రీవాస్తవ పది రోజుల పాటు సెలవుపై వెళ్లనున్నారు. దీంతో జాయింట్ కలెక్టర్‌ను ఇన్‌చార్జి పీవో బాధ్యతలను అప్పగించారు. అదేవిధంగా ఇన్‌చార్జి సబ్ కలెక్టర్‌గా డీఆర్వో హేమలతను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు

బొబ్బిలి డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తరఫున ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకమునుపే దళారులు రంగప్రవేశం చేసి అనేక చోట్ల కొనుగోలు చేసేశారని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు ఆరోపించారు. బుధవారం బొబ్బిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపునకు సంబంధించి కూటమిప్రభుత్వం లేనిపోని ప్రచారం చేసుకుంటోందని, వాస్తవానికి పరిస్థితులు అలా లేవని రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై అన్ని కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆందోళనలు చేపడుతున్నామని, ఈనెల 27న విద్యుత్ చార్జీలు పెంపుపై నిరసనలు చేపడతామని తెలిపారు. సమావేశంలో వైసీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, తూముల రామసుధీర్, పెద్దింటి రామారావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు కోరారు.బుధవారం బొబ్బిలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూసదస్సుల్లో రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖల వారి సేవలను ఉపయోగించుకొని భూవివాదాలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమతి గౌరవాధ్యక్షుడు శ్రీ భారతానందస్వామీజీ, కార్యవర్గ సభ్యులు బలగ శంకరరావు, నల్ల బలరాం పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో కంటి వైద్యశిబిరం



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):గుమ్మలక్ష్మీపురంలో బుధవారం కంటి వైద్యశిబిరాన్ని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి ప్రారంభించారు.ఈ సందర్భంగా 200 మందికి కంటి పరీక్షలు చేసి ఆపరేషన్ కోసం అవసరమైన వారిని గుర్తించారు.కార్యక్రమంలో పుష్పగిరి ఆసుపత్రి వైద్యులు భరత్, కోఆర్డినేటర్ భీమాశంకర్, వైద్యులు గుడివాడ ప్రభాకరరావు, మండలకన్వీనర్ సుధా పాల్గొన్నారు.

ఐఆర్ 25 శాతం ప్రకటించాలి

పాలకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మధ్యంతర భృతి(ఐఆర్) కనీసం 25 శాతం ప్రకటించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తండాడి అనీల్‌కుమార్, గొల్ల ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో బుధవారం కోరారు. మధ్యంతర భృతి, పాత బకాయిలు విడుదల, నూతన పిఆర్‌సి కమిషన్ తదితర ఆర్థిక అంశాలపై ప్రభుత్వం స్పందించలేదని వాపోయారు.

98 శాతం రుణాల రికవరీ

పాచిపెంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ.2.50 కోట్లు లక్ష్యం కాగా 267 మందికి రూ. 1.82 కోట్లు మంజూరు చేసి వారి నుంచి 98 శాతం రికవరీ చేసి సాధించామని పార్వతీపురం మన్యం జిల్లా స్త్రీనిధి అదనపు జనరల్ మేనేజర్ కె.హేమలత తెలిపారు.బుధవారం పాచిపెంటలో విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకులింకేజీ రుణాలకు సంబంధించి 98 శాతం రికవరీ చేశామని చెప్పారు. 747సంఘాలకుగాను రూ.29.10 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యంకాగా 213 సంఘాలకు గాను 12.47 కోట్లు మంజూరు చేశారని చెప్పారు.మార్చి నెలాఖరులోగా శత శాతం పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం బి.శివుడునాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు చేపట్టాలి

గరుగుబిల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెలమలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణలోని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకరమ్మపై చర్యలు చేపట్టాలని కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.మధుసూదనరావు,జి.వెంకటనాయుడులు డిమాండ్ చేశారు. బుధవారం గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలపై జాతీయ మానవ హక్కుల సంఘానికి, కేంద్రహోంశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. వెలమ జాతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

గ్రామ సంఘాల సభ్యులకు శిక్షణ

బొబ్బిలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ మహిళా సంఘం సభ్యులకు విజన్ బిల్డింగ్ మాడ్యూల్‌పై మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం పి.భాగ్యలక్ష్మి స్వయం సహాయక సంఘాల ద్వారా సభ్యులు ఏవిధంగా అభివృద్ధి చెందాలో అవగాహన కల్పించారు.